అది మన దేశమే. అయినా, ఆ రైలు సరిఅయిన వేళకే పరుగెడుతూంది. దేశంలో రైళ్లన్నీ కలిసి కట్టుగా, ఏకగ్రీవంగా లేటుగా నడుస్తున్నా—ఉలిపికట్టె దో డా రన్నట్టు—ఆ రైలు మాత్రం సరిఅయిన వేళకే పరుగెడుతూంది. నిజమే. రైలు లేటుగా నడిచి తీరాలనే మన దేశపు రూలుకి ఇది వ్యతిరేకమే. రూలు ప్రకారం మిగిలిన రైళ్లన్నీ లేటుగా నడుస్తుంటే, తన పుట్టేదో మునిగినట్టు ఆ రైలు మాత్రం సరిఅయిన వేళకే పరుగెడుతుందా? దేవుడు లేడూ? ఈ అన్యాయం చూడడూ? ఈ ఉలిపికట్టె రైలుకి తగిన శిక్ష వేయడూ?

అందుకే— ఆ అర్ధరాత్రి, కటిక చీకట్లో, ఒక వంతెన మీద ఆ రైలు పాపం బద్దలైంది. అక్కడే పెద్ద ఏక్సిడెంట్ అయింది. ప్రజల నందరినీ సరిఅయిన వేళకి గమ్యం చేర్చాలనుకున్న ఆ రైలు చాలామందిని నరకానికి తొందరగానే పంపింది. మిగిలిన వాళ్లకి ఈ భూమిమీదే నరకాన్ని చూపించింది.

గాలికంటె వేగంగా ఈ వార్త అందరికీ తెలిసింది. డాక్టర్లొచ్చారు. పెద్దాఫీసర్లొచ్చారు. ఎమ్. ఎల్. ఎ. లొచ్చారు. మంత్రులొచ్చారు. చచ్చిన వాళ్లని వెతుక్కుంటూ ఆస్తులహక్కుదార్లొచ్చారు. చావని వాళ్లని చూసి పోవడానికి వాళ్ల చుట్టాలంతా వచ్చారు.

డాక్టర్ వైద్యనాథం అపర ధన్వంతరి. చక్కటి హస్తవాసిగల డాక్టర్. ఇన్నెందుకు? అత నీ దేశంలో ఉండదగని వాడు. ఏ అమెరికాలోనో ఉంటే నోబెల్ ప్రైజ్ లాంటిది కొట్టేసి తీరును.

మృత్యువు ఇంటికెళ్లి తలుపు తట్టిన వాళ్ల నెందరినో వెన్ను తట్టి వెనక్కి తిప్పి ఈ లోకానికి తెచ్చాడు. గ్రహపాటు వల్ల అతను 'రూలింగ్' పార్టీకి చెందలేదు కాని, అయితే—అత నప్పుడు చేసిన సేవకి 'పద్మ'ల అవార్డేదో కొట్టేసును. అత నప్పుడు చేసిన ఆపరేషన్లన్నీ ఒక ఎత్తు, రామ్మూర్తికి చేసిన ఆపరేషన్ మరొక ఎత్తు. ఆ ప్రమాదంలో రామ్మూర్తి మెదడు నలిగిపోయింది. ఎందుకూ పనికి రాకుండా పోయింది. అదే రైల్లో ప్రయాణం చేస్తున్న శశికాంత్ ప్రాణాలని పోగొట్టుకున్నాడు. కాని, అతని మెదడు మాత్రం సరిగానే ఉంది.

అక్కడే పండింది వైద్యనాథం అదృష్టం. శశికాంత్ మెదడు తీసి రామ్మూర్తికి అతికా డతను. రామ్మూర్తి కోలుకున్నాడు. మళ్లీ మనలో పడ్డాడు. పత్రికలన్నీ తెగ పొగిడాయి, డాక్టర్ వైద్యనాథాన్ని. అసలు వైద్యసౌకర్యం లేని



# ఏక్సిడెంట్

—కె. రఘురామం

ఆ ఊళ్ళో, దేశంలో ఒక మారుమూల ఇంత ఘనమైన ఆపరేషన్ చెయ్యడం మాటలా మరి? ప్రపంచంలో మొదటి సారి మెదడును మార్చేసిన ఘనత వైద్య శాఖానికే దక్కింది. 'బ్రెయిన్ ట్రాన్స్ప్లాంటేషన్' అంత తేలికైనది కాదు గదా! ఈ ఆపరేషన్ గురించి ప్రపంచంలోని ప్రముఖులంతా డాక్టర్ వైద్యనాథానికి బ్రహ్మరథం పట్టారు.

మెదడు మార్చబడ్డ రామ్మూర్తి పూర్తిగా కోలుకున్నాడు. మళ్లీ మనలో పడ్డాడు. అతని కిది పునర్జన్మ అన్నారు. అవును, నిజంగా అతని కిది పునర్జన్మే. ఎందుకంటే — అతను మునపటి రామ్మూర్తి కాదు. రామ్మూర్తి ఆలోచనలూ, జ్ఞాపకాలూ లే వితనికి. ఇతని ఆలోచనలూ, జ్ఞాపకాలూ శశికాంత్‌కి చెందిన మెదడువి. అందుకే— ఇతను రామ్మూర్తి కాదు. అలాగని శశికాంతూ కాదు. రామ్మూర్తి శరీరంలో ఉన్న శశికాంత్ ఇతను.

ఓ రోజు పార్వతి వచ్చింది, రామ్మూర్తిని చూట్టానికి. శరీరం రామ్మూర్తిదే కానీ, అక్కడ రామ్మూర్తి మనస్సు లేదు. ఉన్నది తానెవ్వరో తెలియని కొత్త వ్యక్తి. అతని జ్ఞాపకాలన్నీ శశికాంత్‌వే. అందుచేత— అతను పార్వతిని గుర్తించలేదు. పార్వతి ఏడ్చింది. తల బాదుకుంది. అయినా, అతని కిదేం అర్థం కాలేదు. పార్వతి రామ్మూర్తి భార్య అని అతని కెలా తెలుస్తుంది? ఎవరు చెప్ప గలరు? పార్వతిదంతా అరణ్య రోదనమే.

కొన్ని కొన్ని సంఘటనలు జీవితాలనే మార్చేస్తాయి. మారిన జీవితాల తాలూకు గత స్మృతులు మనుషుల్ని తాళాలా దహించి వేయగలవే కాని, వెన్నెలగా హాయిని ప్రసాదించడం కష్టం. పరాయివాడి మెదడుతో నిలబడ్డ ప్రాణం, ఒకే ఒరలో రెండు కత్తులు - పరిణామాలు?



ఢిల్లీలో ఇటీవల ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావును ఘనంగా సన్మానించారు. 14 తెలుగు విద్యా సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మానోత్సవంలో కూచిపూడి నృత్యకళా ప్రదర్శన లిచ్చిన రాజా, రాధారెడ్డిలను ముఖ్యమంత్రి అభినందిస్తున్న ఫోటో.

అయింది. అతని కామె ప్రవర్తన వింత అనిపించింది. ముక్కూ మొహం తెలియని ఆమె ఎందు కిలా రోదిస్తూంది? బహుశా పిచ్చిది కావచ్చనుకున్నాడు.

పార్వతికి తన గుండె నెవరో పిండిన ట్లయింది. మొన్నటిదాకా తనవాడయిన రామ్మూర్తి నేడు తన కిక లేడు. రామ్మూర్తి బ్రతికాడు. కానీ, చచ్చిన వాళ్లే మెరుగు. పార్వతి దో వింత పరిస్థితి. ఆమె భర్త— రామ్మూర్తి— బ్రతికే ఉన్నాడు. కాని, ఆమె విధవ. పార్వతిని చూసి, ఆమె పరిస్థితి కొంత తెలుసుకొని అతను చలించిపోయాడు. కాని— అతనేం చెయ్యగలడు? అతని మన స్సెప్పుడో సరితకే అంకితమైంది. అతని ఆలోచనలన్నీ సరితను గురించే. వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారు, లోకంలో ఎవ్వరూ ప్రేమించుకోనంతగా. అతని కా క్షణంలో పార్వతిమీద జాలేసింది. అయినా, సరిత తలపులు అతన్ని బంధించివేశాయి. పార్వతి భోరున ఏడుస్తూ వెళ్లిపోయింది. చూస్తూ ఊరుకున్నాడు అతను.

అతని ఆలోచనంతా ఒకటే. ఏక్సిడెంట్ జరిగి ఇన్నాళ్లయినా సరిత రాలేదు అతన్ని చూట్టానికి. అతనే వెళ్లాడు సరిత దగ్గరికి.

"నేను వచ్చేశా, సరితా! మృత్యు ముఖంనుండి బయటపడి, నీ కోసమే కలవరించి, నీ కొరకే ఎదురు చూసి, కలవరించి కలవరించి, ఎదురుచూసి ఎదురుచూసి, నీ కోసమే వచ్చేశా." సరిత అతన్ని చూడలేదు. అతన్ని నమ్మలేదు. అతన్ని గుర్తించలేదు. జరిగిందంతా చెప్పా డతను. ఆమె కోసం మళ్లీ జన్మ ఎత్తి వచ్చానని చెప్పాడు. ఇది తనకు పునర్జన్మ అన్నాడు.

ఆశ్చర్యంతో చూసింది సరిత. "అయామ్ సారీ!" అన్న దామె. "నా మనసంతా నీవే అయినా, నా తలపులన్నీ నీవే అయినా, నా ప్రేమ ఎప్పటికీ నీదే అయినా, అయామ్ సారీ!" అన్న దామె. "నా ప్రాణం, నా శరీరం నీదే అయినా, నీవే అయినా— నీలో ఉన్నది నా శశికాంతే అయినా— నాకు తెలిసిన శశికాంత్ రూపం వేరు; నువ్వు వేరు. అందుచేతే నీ రూపం నేను చూడలేను. నీ తలపులలో నా శేషజీవితాన్ని గడుపుతాను. నువ్వు నన్ను మరిచిపో. అయామ్ సారీ!" అన్న దామె.

తనేం చేసినా లాభం లేదని తెలుసు నతనికి. సరిత మనస్సు ఎంత దృఢమో తెలుసు నతనికి. ఆమె నిర్ణయాన్ని తను మార్చలేడు. తన జీవితగమనాన్ని మార్చుకో లేడు. గుండె బ్రద్దలయిం దతనికి. గుండెలు పగిలే పార్వతి దుఃఖం తెలిసొచ్చిం దతనికి. కానీ, ఏమీ చెయ్యలే డతను. పార్వతిని అతడు ప్రేమించలేడు. సరిత అతన్ని ప్రేమించలేదు. అతను బ్రతికే ఉన్నాడు. కానీ— చచ్చినవాళ్లే మెరుగు. అతని గుండె ఒక అగ్ని గోళం అందులో లావా ఉడుకుతూంది. తన మీద దేవుని కెందు కింత కక్ష? తనేం చేశాడని వేశా డీ శిక్ష? శత్రువుకైనా వద్దీ నరకం. క్షణమైనా నిలువలేకపోయాడు. ఆ బాధని భరించలేకపోయాడు.

మరునాడే పేపర్లో వచ్చిం దో వార్త— రైలుకింద తల పెట్టిన ఒక యువకుడు మరణించాడని, అతని మెదడంతా ఎందుకూ పనికిరాకుండా నజ్జు నజ్జుగా అయిపోయిందని

ఇది ఏక్సిడెంట్ అంది లోకం కానీ దాని కేం తెలుసు— రామ్మూర్తి శరీరంలో శశికాంత్ పడ్డ నరకం?

తనకు పట్టిన దురవస్థ మరెవరికీ పట్టదని అతని ఆత్మ మాత్రం సంతృప్తిగా నిట్టూర్చిందని ఈ లోకాని కేం తెలుసు? *